మౌలిక వసతులు కరువు!

- శిథిలమైన పశువుల దవాఖాన భవనం
- ఇరుకు గదులతో ఇబ్బందులు
- అపరిశుభ్రంగా పరిసర ప్రాంతం



మౌలిక వసతులులేని పశువైద్యశాల

అయిజ: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పశు వైద్యశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో, మున్సిపాలిటీలో మొత్తం ఎద్దులు 9,320, ఆవులు 3585, గొర్రెలు, మేకలు 80755 ఉన్నాయి. పశువైద్యశాలలో (వీఏఎస్) వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపరాణి పని చేస్తున్నారు. పశువులకు వైద్యసేవల కోసం పశుపోషకులు పశువైద్యశాలకు తీసుకొస్తుంటారు. మున్సిపాలిటీలోని పశువైద్యశాలకు మౌలిక వసతులు కల్పించకపోవడంతో వైద్యులు, సిబ్బంది, రైతులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. పశువైద్యశాల భవనంలో చిన్న గదిలో పశువైద్యాధికారి విధులు నిర్వహిస్తున్నారు. మరో గదిలో పశువైద్యశాల ఫర్నీచర్, మందులు, సబ్సిడీ దాన తదితర వస్తువులు పెట్టారు. పశువైద్యశాల పక్కన, వెనక భాగంగలో ముళ్ల పొదలు ఉండడంతో పాములు, తేళ్లు తరుచూ పశువైద్యశాలలోకి వస్తుంటాయి. శిథిలమైన భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. భవనం ముందు ఖాళీ స్థలం లేకపోవడంతో పశువులకు వైద్య సేవలందించేందుకు పశువైద్యాధికారికి, సిబ్బందికి ఇబ్బందిగా ఉంది. నూతన భవనం నిర్మించడానికి స్థలంలేకపోవడంతో అనువైన ప్రదేశంలో మౌలిక వసతులతో కూడిన భవనాన్ని నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

భవనం ఇరుకుగా ఉంది..



పశువులకు రోగాలు వస్తే గవర్నమెంట్ పశువులదవాఖానకు తీసుకపోతాం. దవాఖానముందు స్థలం లేకపోవడంతో ఒకదాని తర్వాత మరొక పశువును కాంపౌండ్‌లోకి తీసుకపోవాలి. పశువులను బయట నిలబెడుదామంటే మెయిన్‌రోడ్డు, ఆటోలు, జీపులు, మోటార్‌సైకిళ్ల తిరుగుతాయి. స్థలం పెద్దగా ఉన్నచోట పశువుల దవాఖాన కడితే బాగుంటది

– నరసింహులు, రైతు, అయిజ

కొత్త ఆస్పత్రి కట్టాలి



ఇప్పుడున్న పశువుల దవాఖాన చిన్నగా ఉంది. అక్కడ పశువులకు వైద్యం చేయించడానికి ఇబ్బందిగా ఉంది. ఎలాంటి వసతులు లేవు. పాత భవనం కూల్చివేసి కొత్త భవనం కడితే బాగుంటుంది. కొత్త పరికరాలు తెప్పించి, సిబ్బందిని ఎక్కువగా పెట్టి పశువులకు వైద్యంచేయాలి.

– దేవన్న, వేణిసోంపురం

అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాం..



పశువైద్యశాల భవనం ఇరుకుగా ఉండడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాం. పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంతో దుర్వాసన వస్తోంది. సమస్యలు పరిష్కరించాలని ఉన్నతాధికారులను కోరాము. విశాలమైన ప్రదేశంలో నూతన భవనం నిర్మించాలి. ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశాం.

– స్వరూప రాణి, పశువైద్యాధికారిని, అయిజ

వసతి గృహాలపై ప్రభుత్వం చిన్నచూపు


వంట గదిలో కూరగాయలను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు


ధరూరు కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ.

శాంతినగర్: వసతి గృహాలపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని, దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య ఆరోపించారు. వడ్డేపల్లి మండలంలోని రామాపురం ఎస్సీ హాస్టల్‌ను బీఆర్‌ఎస్వీ నాయకులు ఆదివారం సందర్శించారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో పలు సమస్యలను నాయకుల దృష్టికి తెచ్చారు. విద్యార్థులకు సరైన వసతులు కల్పించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు మత్తాలి, మాధవ్, రాజులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

ధరూరు: విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. ఆదివారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం, కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


అలంపూర్‌లో సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న నాయకులు

అలంపూర్: పట్టణంలో సీఎం సహాయ నిధి చెక్కులను రాష్ట్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్ ఆదివారం అందజేశారు. అలంపూర్ మున్సిపాలిటీకి చంద్ర వెంకటేశ్వర్లుకు రూ.97,500, బుక్కాపురం గ్రామానికి చెందిన కురువ రాజేష్‌కు రూ. 60 వేలు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైనట్లు తెలిపారు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, అంజనేయులు, కురువ మధు, తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాలి


అలంపూర్‌లో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

అలంపూర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాలని చైతన్య యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలో చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోం మంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాజన్న, విజయ భాస్కర్, తుమ్మల రవి, మద్దిలేటి, ధర్మరాజు, రజిని బాబు, బుచ్చన్న, హరీష్, మద్దిలేటి, సీపీఐ నాయకులు పెద్దబాబు, చైతన్య యువజన సంఘం సభ్యులు ఉన్నారు.

ప్రేమ చూపడమే క్రీస్తు మార్గం


ధరూరు ఎంబీ చర్చిలో సంఘ పెద్దలతో కలిసి కేక్ కట్ చేస్తున్న పాస్టర్ సీపీ ప్రసాద్ యూథా

గద్వాలటౌన్/ధరూరు: ఎదుటి వారితో ప్రేమగా ఉండటమే క్రీస్తు మార్గమని స్పీకర్ వినోద్ అన్నారు. స్థానిక ఎంబీ మిస్సా చర్చిలో ఆదివారం రాత్రి 8 గంటలకు యూత్ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. యూత్ క్రిస్మస్‌లో యువతి, యువకులు పాటలు పాడుతూ ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పాస్టర్ ఛార్లెస్ శాంతిరాజ్, యూత్ కమిటీ చైర్మన్ డేనియల్, సెక్రటరీ ప్రసాద్, కోశాధికారి కిరణ్‌దాస్, వైస్ చైర్మన్ పృథ్వీ, అడ్వైజర్ రంజిత్, అసిస్టెంట్ ట్రెజరర్ జెస్సీ, తదితరులు పాల్గొన్నారు.

మంచిమార్గం చూపించేలా ఉండాలి

ప్రతి ఒక్కరు తాము బాగుండాలని కోరుకోవడంలో తప్పు లేదని, తమ పిల్లలను మంచి మార్గంలో నడించే వారుగా ఉండాలని పాస్టర్ సీపీ ప్రసాద్ యూథా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏబీ షాలేం చర్చిలో క్రిస్మస్ సర్వదినాన్ని పురస్కరించుకుని పెద్ద మనుషుల క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం యూత్‌తో పాటు సంఘ పెద్దలతో కలిసి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.


గద్వాలలో యూత్ క్రిస్మస్‌లో పాటలు పాడుతున్న యువతులు

జాతరలో ఆకట్టుకున్న గాంధీ వేషధారి



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి జాతరలో ఆదివారం గాంధీ వేషధారణ భక్తులను ఆకట్టుకుంది. ఆలయ సమీపంలోని రథోత్సవంలో గాంధీ విగ్రహం వలే నిటారుగా నిలబడి వచ్చిపోయే భక్తుల నుంచి సాయం కోరుతున్నట్లుగా ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలకు చెందిన బోజా అనే యువకుడు జాతర ప్రదేశాలకు వెళ్లి అక్కడ గాంధీ వేషధారణలో భక్తులను ఆకట్టుకుంటాడు. భక్తులు ఆ యువకుడికి తమవంతుగా సహాయం చేస్తుండడంతో అదే ఆ యువకుడి జీవనాధారంగా మారింది. ప్రతిరోజు రూ.500ల నుంచి రూ.1000ల దాకా భక్తుల నుంచి సహాయం అందుతున్నట్లు పేర్కొన్నాడు.

బడిబయటి పిల్లలను బడికి పంపించాలి



కేటీదొడ్డి: బడిబయటి పిల్లలను బడికి పంపించాలని ఎంవీఎఫ్ ఫౌండేషన్ సభ్యులు అన్నారు. ఆదివారం మండలంలోని కుచినెర్ల గ్రామంలో బడిబయటి పిల్లలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపించాలని, చదివించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మదర్స్ కమిటీ కన్వీనర్ సరోజమ్మ, తదితరులు ఉన్నారు.

రోడ్డుపై కొండచిలువ సంచారం



మానవపాడు: రెండు వారాల క్రితం మానవపాడు మండల కేంద్రంలోని కాల్వ వద్ద రోడ్డుపై కొండచిలువ సంచరించిందని రైతులు, ప్రజలు భయాందోళన చెందారు. శనివారం రాత్రి సమయంలో మిరప పంటపొలాలకు నీరు కట్టడానికి వెళ్లిన కొంతమంది రైతులకు రోడ్డుపై కొండచిలువ సంచరిస్తూ కనిపించింది. దీంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. వివిధ గ్రామాల పంటపొలాలు, రోడ్ల వెంట కొండచిలువ సంచరిస్తోందని రైతులు, ప్రజలు అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలి. ఉన్నతాధికారులు, జిల్లా ఫారెస్ట్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బోయలగూడెంలో ఎమ్మెల్యే పూజలు


బోయలగూడెం ఆలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలటౌన్/గట్టు: మండలంలోని బోయలగూడెంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతర సందర్భంగా ఆదివారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యా ర్డు చైర్మన్ హనుమంతు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్ పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాలస్వామి రథోత్సవం

గద్వాలపట్టణంలో కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించి శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఉభయ దేవేరులను దివ్యరథంపై అధిష్టించి కనుల పండువగా వీధుల్లో ఊరేగించారు. రథోత్సవాన్ని తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో శ్రీ సంతాన వేణుగోపాల స్వామి రథాన్ని భక్తులు పోటీ పడి లాగారు. రథోత్సవం రోజు వేణుగోపాల స్వామిని దర్శించుకుంటే పాపపరిహారం అవుతుందని భక్తుల విశ్వాసం. అంతకుముందు ధర్మకర్తలు రాజ వంశీయులు డాక్టర్ విక్రంసింహారెడ్డి, డాక్టర్ సుహాసిని రెడ్డి, సంయుక్తమ్మల చేత పండితులు రాఘవచారి, పవన్‌కుమార్ పూజలు చేయించారు.


గద్వాలలో సంతాన వేణుగోపాలస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



దీక్ష శిబిరంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

గద్వాలటౌన్: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతురావు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని, ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు 13వ రోజుకు చేరాయి. ఈ దీక్షకు తపస్ నాయకులతో పాటు వివిధ సంఘాల నాయకులు వేరు వేరుగా సంపూర్ణ మద్దతు తెలిపారు. కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్‌ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్‌ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులు చేతబట్టి దీక్ష చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ తన దగ్గర పెట్టుకుని, సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయకుంటే ప్రభుత్వంపై సమరం సాగిస్తామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు హుస్సేనప్ప, గోపాల్, ప్రణీత, శేషన్న, రామంజనేయులు, ఎస్‌ఓలు గోపిలత, ఆసియాబేగం, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం చేయండి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయ్ శత జయంతి సందర్భంగా నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 25న బుధవారం ఉదయం మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లోని బీజేపీ కార్యాలయం ముందు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతీ యువకులు అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు తాహెర్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమసేన రావు, మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు భగత్ రెడ్డి, ప్రదీప్ కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.

శారదాదేవి జయంతి


శారదాదేవి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

అయిజ: మండలంలోని సంకాపురంలో గ్రామస్తులు శారదాదేవి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ సేవా సమితి సభ్యులు వెంకట్రాములు మాట్లాడారు. శారదా దేవి ఒక హిందూ మత గురువు, ఆమెను పవిత్రమాత అని పిలుస్తారన్నారు. శ్రీరామకృష్ణుడి ఆధ్యాత్మిక భార్య శారదాదేవి 1853 డిసెంబర్ 22న పశ్చిమ బెంగాల్‌లో జన్మించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు సత్యనారాయణ, వెంకట్రాములు, కృష్ణ, రాముడు, దాసు, ఎర్రన్న, పెద్ద రంగులన్న, వెంకటరెడ్డి, భత్తలయ్య, పాగుంట, రుక్కన్న, ఈశ్వరన్నగౌడు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గద్వాల పట్టణంలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గద్వాలటౌన్/మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990–1991 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. తమకు పాఠాలు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను పుష్పగుచ్ఛాలతో సాదరంగా వేదికపైకి తీసుకెళ్లారు. ముందుగా మరణించిన ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను పూలమాల శాలువా, మెమెంటోలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో చోటా, పరమేష్, శ్రీధర్, సుశీల, రోజా రాణి, చంద్రన్న, నాగేశ్వర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, రజాక్ పాల్గొన్నారు.

- గద్వాల పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో 2007–2008 పదో తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, దినేష్, బీసన్న, కళావతి, హనుమంతు రావు, రాజేంద్రకుమార్, మురళీకృష్ణ, గిరిధర్, విజయప్రభ, ఉషారాణి పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహం ఊరేగింపు


మాచర్ల గ్రామంలో అమ్మవారి విగ్రహా ఊరేగింపు

గట్టు: మండలంలోని మాచర్లలో ఆదివారం సవారమ్మ విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. మాచర్ల చెరువు కట్ట దగ్గర నూతనంగా నిర్మించే ఆలయంలో మంగళవారం సవారమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. బల్గెర గ్రామం నుంచి మాచర్ల చెరువు కట్ట వరకు అమ్మవారి విగ్రహాన్ని భాజాభజంత్రీలు, మంగళహారతులతో ఊరేగించారు. చిన్నారులు కోలాటం నిర్వహించారు. ఊరేగింపులో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మొదటి రోజు జాలాదివాసం, రెండో రోజున ధాన్యాదివాసం, మూడు రోజు సోమవారం వేద మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

క్లుప్తంగా

నిబంధనలు ఉల్లఘించినా పట్టించుకోరా?

గద్వాలటౌన్: పట్టణంలో భవన నిర్మాణాల అనుమతి విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. భవన నిర్మాణదారుల ప్రయోజనాలే లక్ష్యంగా వ్యవహరిస్తూ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. మామూళ్ల మత్తులో అధికారులు వారికి వంతపాడుతున్నారు. స్థానిక 37వ వార్డులోని ఆంధ్రబ్యాంకు పక్కన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారు. దీనిపై కాలనీ వాసులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌కు నివాస అనుమతి తీసుకుని జీ+2లో వాణిజ్య దుకాణ సముదాయాన్ని చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ నిర్మాణం వల్ల కాలనీ వాసులకు ట్రాఫిక్ చిక్కులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన వాణిజ్య సముదాయం పట్ల మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణం నిర్మాణ పనులు నిలిపేయాలని కోరారు. ఈ విషయంపై టౌన్ ప్లానింగ్ అధికారి కల్యాణ్ చక్రవర్తి వివరణ కోసం ప్రయత్నించగా, ఆయన స్పందించలేదు.

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



అలంపూర్: కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యే విజయుడు సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీని ఆదివారం అందజేశారు. అలంపూర్ మండలంలోని కోనేరు గ్రామానికి చెందిన స్వాములు ఆపరేషన్ కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4 లక్షల ఎల్‌ఓసీ వచ్చినట్లు తెలిపారు. ఎల్‌ఓసీ కాపీని కుటుంబ సభ్యులకు అందజేశారు. వీరితో పాటు నాయకులు ఉన్నారు.

పండుగ సందర్భంగా దుస్తుల పంపిణీ



అయిజ: క్రిస్మస్ పండుగ సందర్భంగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందికి ఆదివారం డాక్టర్ అబుల్ ఫజల్ మున్సిపాలిటీ కార్యాలయం ముందు నూతన వస్త్రాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద ప్రజలు పండుగను సంతోషంగా జరుపుకోవాలని దుస్తులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అలవాట్లు మార్చుకుంటే ఎదుగుతాం



కేటీదొడ్డి: వాల్మీకులు పోరాడాల్సింది, యుద్ధం చేయాల్సింది శత్రువుల మీద కాదని, మీరు బానిసైన అలవాట్ల మీద అని, అప్పుడైతేనే మీరు గొప్పగా ఎదుగుతారని వాల్మీకి ఉద్యోగ సంఘం అధ్యక్షులు ఆంజనేయులు అన్నారు. మండల పరిధిలో సోంపురంలో ఆదివారం వాల్మీకి విద్యా చైతన్యయాత్రలో భాగంగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ మేడికొండ ఈశ్వర్, జిల్లా నాయకులు అశోక్, తిమ్మప్ప, వీరన్న, తిక్కన్న, వాల్మీకి పెద్దలు తదితరులు ఉన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



అయిజ: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆదివారం జాతీయ గణిత దినోత్సవం మండల కేంద్రంలోని న్యూ గీతాంజలి పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటం ముందు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వెంకటేష్ మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో శ్రీనివాస రామానుజన్ ప్రముఖులని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.